# ఉత్తర

సుధేష్ణాదేవి శిరోజాలంకరణ చేస్తోంది సైరంధ్రి. కేశపాశంపైన పరిమళాలు వెదజల్లే పూలు రకరకాలుగా అమరుస్తూ, ఎన్నెన్నో ముచ్చట్లు చెప్పటం సైరంధ్రికి అలవాటై పోయింది. అంతఃపుర ప్రపంచం తప్ప మరోటి తెలియని సుధేష్ణాదేవి సైరంధ్రి తను విన్నవి, చూసినవి ఎన్నెన్నో విశేషాలు చెప్తుంటే ...హలంతో వింటోంది.

పాండవుల పరాక్రమాన్ని, ఇంద్రప్రస్థపుర వైభవాన్ని ఇతరులు చెప్పగా తను విన్నానని ఏదో సందర్భంగా రోజూ చెప్తూనే ఉంటుంది సైరంధ్రి. సుదేష్ణా దేవికి విసుగు కలగకుండా ఎప్పటికప్పుడు కొత్తగా ఉండేట్టుగా మాట్లాడటంలో సైరంధ్రి నేర్పరి.

ఆ రోజు సుభద్రార్జునుల కుమారుడు అభిమన్యుణ్ణి గురించి మాట్లాడుతోంది సైరంధ్రి. సుధేష్ణ చెవులప్పగించి వింటోంది. అక్కడికి రాకుమారి ఉత్తర వచ్చి ఎంతో సేపయింది. ఆ విషయమే గమనించలే దిద్దరూ.

అభిమన్యుని విలువిద్యా కౌశలం, ధైర్యసాహసాలు వర్ణించి, అతను అందంలో జయంతుణ్ణి, పరాక్రమంలో అర్జునుణ్ణి మించినవాడని తన కెవరో ...ప్పగా విన్నానంది సైరంధ్రి. ఇంతకు ముందు పాండవుల గురించి చెప్పగా చాలాసార్లు వింది ఉత్తర. కానీ ఈనాడు రెట్టించిన ఆనందంతో, ఉత్సాహంతో తనను తాను మరిచిపోయి అభిమన్యకుమారుని పరాక్రమాతిశయాల గురించి, రూపాతిశయాన్ని గురించి చెప్తుంటే వింటున్న ఉత్తరకి చాలా ఆశ్చర్యమేసింది. అభిమన్య రూపవర్ణన ఉత్తర మనసులో నిలిచిపోయింది. అ అభిమన్య కుమారుని తన కళ్ళెదుట చూస్తున్న అనుభూతి కలిగింది ఉత్తరకు. ఏ భాగ్యవతి అతన్ని ప్రేమించి, అతన్ని చేపడుతుందో అనుకుంటూ అభిమన్యకుమారుని తలపుల్లో మునిగిపోయింది ఉత్తర.

నర్తనశాలలో నాట్యాచార్యుల వారు వేంచేశారని చెలికత్తె చెప్పగా, ఊహాలోకం నుంచి బయటపడి వేగంగా నర్తనశాల చేరింది ఉత్తర.

నాట్యాచార్యులంటే ఎనలేని భక్తి గౌరవాలున్నాయి ఉత్తరకు. ఆయన పాదాలకు నమస్కరించి విద్యాభ్యాసం ప్రారంభించింది. నాట్యాచార్యులు అభినయం చేసి చూపుతున్నారు-ఉత్తర చూపులు అభినయంపైనఉన్నా, మనసునిండా అభిమన్యుని ఆలోచనలే.

ఆమె పరధ్యానం కనిపెట్టిన బృహన్నల "నీ ధ్యానం ఎక్కడుంది?" అన్నాడు మందహాసం చేస్తూ.

ఉత్తర ఉలిక్కిపడింది. గురువుగారు తన పరధ్యాన కారణ మడుగుతున్నారు. తను ఏ సమాధానం చెప్పాలి? సిగ్గుతో ముఖం ఎర్రబడింది. తను అసత్యం చెప్పలేదు.

''సైరంధ్రి అంతఃపురంలో చెప్పిన మాటలే నా మనసులో మెదులుతున్నాయి." నెమ్మదిగా అంది.

''ఏం చెప్పింది?" నాట్యాచార్యుడు ఉత్తర వంకే చూస్తున్నాడు.

''అభిమన్య కుమారుని గురించి."

''ఏం విశేషాలు చెప్పింది?" నాట్యాచార్యుని మాటల్లో ఉత్సాహం పెల్లుబికింది.

''అభిమన్యకుమారుని పరాక్రమాన్ని రూప గుణాదుల్ని చెప్పింది - ఇంకా ఎన్నెన్నో విశేషాలు చెప్పింది. సైరంధ్రి.'' - ఉత్తర మాటలు తడబడ్డాయి. ముఖాన పట్టిన స్వేదబిందువుల్ని తుడుచుకుంటూ, ఎర్రటి పాదాల వంక చూసుకుంటూ తల వంచి కూర్చుంది.

నాట్యాచార్యుని మనసులో సుభద్ర, అభిమన్యులు ఒక్కసారి మెదిలారు. గతం కళ్ళముందు నిలిచింది. సంయమనంతో మనసు నిగ్రహించుకున్నాడు.

ఉత్తర ముఖంలో కానవచ్చిన అనూహ్యమైన కాంతి, సంతోషం నాట్యాచార్యునికి ఎంతో ముచ్చట గొలిపాయి. ఆమె మనసు క్షణంలో పసిగట్టగలిగాడు. రోజూ నాట్యం నేర్చుకొనే ఉత్తరలా కనిపించలేదా క్షణంలో ఆమె అతని కళ్ళకు.

''నీకు అభిమన్యకుమారుని చూడాలని ఉందనుకుంటాను.'' మందహాసం చేస్తూ ఉత్తర వంక చూసి నాట్యాచార్యు ంటుంటే, ఆమె శరీరం ఒక్కసారి పులకించింది. సిగ్గుతో మౌనం వహించింది.

''ఈ రోజు ఇక అనధ్యయనమేగా?'' అన్నాడు ఉత్తరను చూస్తూ బృహన్నల.

తన ముఖకవళికలు గమనించకుండా ఉండాలని, తత్తరపాటుతో లేచి, పాదాభివందనం చేసి, చెంగున నర్తనశాలను వదిలి పరుగుతీసింది ఉత్తర.

నాట్యాచార్యుడు నవ్వుకొన్నాడు.

* * *

ఉత్తర గోగ్రహణ సందర్భంగా కౌరవసేనను ఎదుర్కొన్నది బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడేనని, కంకుభట్టాదులు ధర్మరాజాదులే అనే వార్త విరాట నగరమంతా వ్యాపించింది. ఆ ఆశ్చర్యాన్నుంచి తేరుకొనేలోపల, కంకుభట్టాదుల సహాయంతో విరాటరాజు దక్షిణ గోగ్రహణం చేసిన సుశర్మను గెలిచాడని, ఉత్తర గోగ్రహణం చేసిన కౌరవులను అర్జునుడు గెలిచాడని, ప్రజలంతా చెప్పు కుంటూ, ఆనందోత్సాహాలతో తేలిపోయారు.

కానీ, అందరూ విజయోత్సాహం జరుపుకుంటుంటే భయంతో, ఆలోచనా మగ్నయై ఉత్తర ఒంటరిగా అంతఃపురంలో కూచుంది.

తనకు నాట్యం నేర్పిన బృహన్నల అర్జునుడా? అభిమన్యుడు ఆయన కుమారుడా? సైరంధ్రి అర్జునుని భార్య ద్రౌపదా? అభిమన్యు కుమారుని గురించి తను నాట్యాచార్యునితో సంభాషించిన విషయం గుర్తుకు రాగానే ఒకవైపు నుంచి భయం, మరోవైపు నుంచి సిగ్గు ముంచెత్తాయి ఉత్తరను.

తన రాజ్యాన్ని కౌరవసేనల నుంచి కాపాడిన అర్జునుణ్ణి తలచుకోగానే కృతజ్ఞతాభావంతో విరాటరాజు మనసు కదలిపోయింది. అంతటి ఉపకారం చేసిన అర్జునునికి తను ఏ ప్రత్యుపకారం చేయగలడు? విరాటరాజు ఎన్నో విధాల ఆలోచన చేశాడు.

పాండవు లందరినీ తన సభలో ఘనంగా సన్మానించాలి. కానీ ఆ సన్మా నంతో వారి ఋణం తీర్చుకోగలడా తను - అనుకుంటున్న విరాటరాజుకి ఉత్తర కుమారుని సంప్రదించా లనిపించింది.

ఉత్తర కుమారునికి అమితమైన భక్తి గౌరవాలున్నాయి అర్జునునిపైన. అర్జునుని శౌర్యప్రతాపాలు కళ్ళారా గాంచాడు తను - ఆ మహావీరునికి తన చెల్లెల్నిచ్చి వివాహం చేయాలి. తను కృతజ్ఞత చూపించుకుందుకు ఇదే మార్గం అనుకున్నాడు ఉత్తరుడు. ఆ అభిప్రాయం విరాటరాజుకి ఎంతో సముచితంగా తోచింది.

సన్మానసభ ఏర్పాటు చేశాడు విరాటరాజు. ధర్మరాజాదులంతా ఆహ్వాని తులై, ఆసీను లయ్యారు.

సర్వాభరణభూషితురాలను చేసి ఉత్తరను సభలోకి తీసుకురావలసిందిగా కబురు పెట్టారు. విషయమేమిటో అర్థం కాని ఉత్తర భయం భయంగా సభలో అడుగు పెట్టింది - అర్జునుడు ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు.

విరాటరాజు ముఖంలో ఆనందం దాగటంలేదు. "మీరు నా రాజ్యంలో ఉండటంతోనే నా రాజ్యం పావనమైంది. మహావీరుడైన అర్జునుడు నా రాజ్యాన్ని రక్షించాడు. ఆయన ఋణం తీర్చుకోటానికి మార్గం ఆలోచించాను."

సభలో అందరూ విరాటరాజు ముఖం వంక చూపులు నిల్పారు.

"నా కుమార్తె ఉత్తరను అర్జునునికి సభాముఖంగా సమర్పిస్తున్నాను." విరాటరాజు చేతులు జోడించి సభకు నమస్కరించాడు.

ఉత్తర ముఖం ఒక్కసారి వివర్ణమయింది. అచేతనురాలైంది. అర్జునుడు ఆమెను గమనిస్తూనే ఉన్నాడు.

"విరాట మహారాజుల వారి విన్నపం విన్నాం. వారి కృతజ్ఞతాభావానికి ఆనందం వెలిబుచ్చుతున్నాం."

అర్జునుని మాటలు ఉత్తరకు పిడుగుపాటులా ధ్వనించాయి. కాళ్ళ కింద నేల కదలిపోతున్నట్లనిపించింది.

"నేను ఉత్తర రాకుమారి గురువును. ఆమె ఎడల నాకు ఎప్పటికీ పుత్రికా భావమే ఉంటుంది. అందుకే మా అభిమన్యు కుమారునితో ఆమె వివాహం జరిపించటం సముచితమని తలుస్తాను."

అర్జునుడు మందహాసం చేస్తూ ఉత్తర వంక చూస్తుంటే, ఉత్తర చైతన్యవంతురాలయింది. ఆమె నయనాల్లో ఆనందబాష్పాలు తళుక్కున మెరిశాయి. ముఖంలో ఆనందరేఖలు తాండవించాయి.

ఉత్తర ముఖారవిందాన్ని శ్రద్ధగా తిలకిస్తున్న ధర్మరాజు, "మా అర్జునుని అభిప్రాయం మాకూ సముచితంగా ఉంది" అన్నాడు గంభీరంగా.

జయజయధ్వానాలతో సభ మారుమ్రోగింది. పాండవుల అజ్ఞాతవాస పరిసమాప్తి, ఉత్తరాభిమన్యుల వివాహ ప్రకటన వార్తలు అందుకున్న శ్రీకృష్ణ బలరామాదులు సుభద్రాభిమన్యులతో కలసి, పెళ్ళివారై తరలి వచ్చారు విరాట నగరానికి.

సమస్త దేశాధీశులు, బంధువులు, విరాటనగర ప్రజలు ఉత్తరాభిమన్యుల వివాహమహోత్సవ వేడుకలను కనులవిందుగా గాంచి ఆనందభరితులయ్యారు.

(ఆధారం: కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం:
విరాటపర్వం : పంచమాశ్వాసం)

(ప్రచురణ: ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 6-7-1988)